‘బీజేపీ, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మడం లేదు’


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: అసత్య ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు మళ్లీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రావాలని కోరుతున్నారన్నారు. సోమవారం నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నాంపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఇంటింటా పర్యటించి ప్రచారం నిర్వహించారు. పలు చౌరస్తాలలో ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత ప్రకటనలు వేసి అధికారంలోకి వచ్చిన వెంటనే ఐదు నెలల్లోనే ప్రజలంతా కాంగ్రెస్ పట్ల తిరగపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ అబద్ధాల పుట్ట అని ఆయన ఆరోపించారు. రేవంత్‌రెడ్డి మాటలు ప్రజలు విశ్వసించడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలలో ఏ ఒక్క గ్యారంటీ కూడా చేపట్టని కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్నివర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తున్నారన్నారు. పలు ప్రాంతాలు, పలు చౌరస్తాలలో పద్మారావు గౌడ్‌కు పూలవర్షం కురిపించి ప్రజలంతా నీరాజనం పట్టారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘మజ్లిస్ వల్లే హైదరాబాద్ వెనుకంజ’


గోషామహల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: 40 ఏళ్లుగా హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీ విజయం సాధించినందుకే హైదరాబాద్ అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. సోమవారం బేగం బజార్ నలుమూలల ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే పదేళ్లపాటు హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్‌ఎస్ వందల కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేస్తే మజ్లిస్, బీజేపీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మతం పేరు చెబుతూ ఓట్లు అడుగుతున్నారన్నారు. మజ్లిస్ కానీ బీజేపీ కాని హైదరాబాద్‌కు ఎలాంటి అభివృద్ధి చేసినా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలంతా ఎటు పోయినా బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తారని ముందుకు వచ్చి చెప్తున్నారని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్‌రాజ్ నరేందర్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ఠాకూర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దానం గెలుపుతోనే హైదరాబాద్ అభివృద్ధి


ప్రచారం నిర్వహిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్: సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపుతోనే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతుందని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మేరు యువజన సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో దానం నాగేందర్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ పేద బడుగు వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తారన్నారు. గత ఐదేళ్లపాటు సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కిషన్ రెడ్డి ఏ ఒక్కరోజు కూడా ఏ ప్రాంతంలో కూడా అభివృద్ధి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేరు యువజన సంఘం ప్రధాన కార్యదర్శి వెన్ను శివకుమార్, ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్ రాజ్, పాశం రాజేందర్ యాదవ్, నర్సింగ్‌రావు, సెక్రెటరీ వై.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో కేన్సర్ పేషంట్లు జాగ్రత్తగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ కృపా బజాజ్

సుల్తాన్‌బజార్: వేసవిలో మన శరీరంలో నీరు శాతం బాగా తగ్గి పోయే అవకాశం అందరికీ ఉంటుందని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్స్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కృపా బజాజ్ అన్నారు. సోమవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మండుతున్న ఎండల్లో కేన్సర్ ట్రీట్‌మెంట్ పేషంట్స్‌లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కోమోథెరఫీ, రెడియోథెరఫి జరుగుతున్న పేషంట్లకు వాంతులు, విరోచనాలు, ఆహారం, నీరు తీసుకోకపోవటం లాంటి సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వృద్ధుల్లో ఎక్కువ ఇబ్బందులు ఉండే అవకాశం ఉంటుందని ఆమె వివరించారు. నీరు వంటి వాటిలో లవణాలు తగ్గకుండా, తగిన మోతాదులో నీరు, కొబ్బరి నీరు, మజ్జిగలో ఉప్పు వేసుకొని తీసుకోవాలన్నారు. ఘన పదార్థాలు ఎక్కువ తీసుకోలేని పక్షాన ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 12 మదర్స్ డే సందర్భంగా ప్రతి ఆడవారు 40 ఏళ్ల దాటిన తర్వాత ఒకసారి రొమ్ము స్కాన్, పొట్ట స్కాన్, కేన్సర్‌కు సంబంధించిన పరీక్షలు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ రసూల్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


పీఆర్‌సీ మిటీతో సమావేశమైన మారం జగదీశ్వర్ తదితరులు


శివశంకర్‌కు నివేదికను అందజేస్తున్న మంజీత్ సింగ్, పద్మారావు

అబిడ్స్: ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీఓస్ యూనియన్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. పీఆర్‌సీ 2023 కమిటీ చైర్మన్ శివశంకర్‌తో జగదీశ్వర్‌తో పాటు టీఎన్జీఓ కేంద్ర సంఘం నాయకులంతా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలతో కూడిన పలు వినతిపత్రాలను ఆయనకు అందజేశారు. అనంతరం మోరం జగదీశ్వర్ మాట్లాడుతూ..మెడికల్ ఇన్‌వాల్యుడేషన్‌పై రిటైర్ ఆయన ఉద్యోగుల పిల్లలకు కంపెన్సేట్ అపాయిమెంట్‌పై వెంటనే ఆదేశాలు జారీ చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎత్తివేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, హెల్త్ కార్డు అన్ని ప్రైవేట్ ఆసుపత్రిలో వర్తింపజేయాలని పీఆర్‌సీ కమిటీ చైర్మన్ శివశంకర్‌ను కోరామన్నారు. దీనిపై పీఆర్‌సీ కమిటీ సభ్యులు అందరూ సానుకూలంగా స్పందించి అతి త్వరలో ప్రభుత్వ ఉద్యోగులు అన్ని సమస్యలు సానుకూలంగా పరిష్కరించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముజీబ్, కేంద్ర సంఘ నాయకులు కస్తూరి వెంకట్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, కొండల్‌రెడ్డి, సిటీ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

పీఆర్సీకి నివేదికను సమర్పించిన ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం..

నాంపల్లి: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ మంజీత్ సింగ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం సోమవారం పీఆర్‌సీ కమిషనర్ శివశంకర్‌ను కలిసింది. ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలపై చర్చించి నివేదికను అందజేసింది. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన డ్రైవర్ల సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు మంజీత్ సింగ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరవేణి పద్మారావు ముదిరాజ్ పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అప్పగింత

గన్‌ఫౌండ్రీ: తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను అబిడ్స్ పోలీసులు 12 గంటల్లోనే ఛేదించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సోమవారం అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం..మురళీధర్‌బాగ్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి తన చెల్లి, బావ చనిపోవడంతో వారి పిల్లలు చరణ్‌కుమార్ (10), వినయ్‌కుమార్ (8) తన దగ్గరనే ఉంచుకున్నాడు. ఈనెల 5న కాలనీ పిల్లలతో కలిసి ఆడుకుంటామని ఇద్దరు చిన్నారులు బయటకు వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అబిడ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తక్షణమే దర్యాప్తు చేపట్టిన అబిడ్స్ పోలీసులు ఒక ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి సీసీ ఫుటేజీల ఆధారంగా 12 గంటల వ్యవధిలోనే పిల్లల ఆచూకీని కనిపెట్టారు. కాలనీ నుంచి బయటకు వచ్చిన పిల్లలు బస్సు ఎక్కి మారేడ్‌పల్లి వెళ్లినట్లు గ్రహించి తక్షణమే మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఛేదించారు. తప్పిపోయిన చిన్నారులను అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో చిన్నారుల మేనమామ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం..

నిత్యం దుర్గంధం


చెత్తతో పేరుకుపోయిన కటోరా హౌజ్

- అధ్వానంగా మారిన కటోరా హౌజ్
- పేరుకుపోతున్న చెత్తా చెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

గోల్కొండ: నాడు కుతుబ్‌షాహీ రాజులకు స్నానానికి నీరందించిన కటోరాహౌజ్ నేడు దుర్గంధంగా మారింది. కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ, హైదరాబాద్ బల్దియా అధికారుల సమన్వయ లోపంతో దోమలకు ఆవాసంగా మారింది. దీంతో పరిసర ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చరిత్రకారులు తటాకం అభివృద్ధి, పరిరక్షణ కోసం చేస్తున్న విజ్ఞప్తులు బుట్టదాఖలవుతున్నాయి.

అభివృద్ధికి తీసుకున్న చర్యలు నిల్..

కటోరా హౌజ్ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. వేసవిలో నీరెండిపోయి పిల్లలకు క్రీడామైదానంగా మారుతుంది. వర్షకాలంలో వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు చేరుతుండంతో మురుగుమయంగా తయారవుతుంది. డ్రైనేజీ నీరు కటోరాహౌజ్‌లోకి రాకుండా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వేసవి కాలంలో ఇందులో పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క విపరీతంగా పెరుగుతుంది. పూడికతీత పనులు కేవలం కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే అని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా వ్యర్థాల డంపింగ్..

కటోరాహౌజ్‌లో వ్యర్థాలు ఇష్టారాజ్యంగా డంపింగ్ అవుతున్నాయి. పటిష్టమైన కంచె లేకపోవడంతో కటోరాహౌజ్‌ను ఆనుకోని ఉన్న వారు వ్యర్థాలను యధేశ్చగా డంపింగ్ చేస్తున్నారు. డంపింగ్ చేసిన వ్యర్థాలు కుల్లి దుర్గంధం వెదజల్లుతున్నాయి. కుల్లిన వ్యర్థ పదార్థాల నుంచి ఈగలు, దోమలు పెరిగిపోతున్నాయి. ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదవశాత్తు వీధి జంతువులు ఇందులో పడి మృతి చెందుతున్నాయి. గత సంవత్సరం ఫెన్సింగ్ లేకపోవడంతో ఓ వ్యక్తి కాలు జారి కటోరాహౌజ్‌లో పడి మృతి చెందాడు.

శిథిలావస్థలో ప్రవేశ ద్వారాలు..

కటోరా హౌజ్‌కు మెయిన్ రోడ్డుతో పాటు వెనుకవైపు ఉన్న అప్పటి ప్రవేశ ద్వారాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భారీ శిలలతో ఏర్పాటు చేసిన ఈ ద్వారాలు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉంది. కటోరా హౌజ్ మెయిన్ రోడ్డును ఆనుకోని ఉండడంతో చెడిపోయిన పాత వాహనాలు, ఆటోలు కటోరా హౌజ్ గోడ పొడవునా పార్కు చేసి ఉంటున్నాయి. గత సంవత్సరం వర్షాకాలంలో ఫెన్సింగ్ కోసం వేసిన ఐరన్ పైపులు పూర్తిగా కుంగిపోయాయి. గతంలో బల్దియా కమిషనర్లతో పాటు మేయర్లు కటోరా హౌజ్ సందర్శించిపోయారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీలు ఇచ్చి వెళ్లారు. అయితే ఇప్పటి వరకు ఆ హామీల్లో ఒకటి కూడా అమలు కాలేదు. కటోరా హౌజ్ పట్ల అధికారుల తీరు ఇదే విధంగా కొనసాగితే రానున్న కాలంలో కటోరా హౌజ్‌ను పూడ్చేసి కబ్జాదారులు ప్లాట్‌లు చేసి అమ్ముకోవడం ఖాయమని పలువురు అంటున్నారు.

25 వేల మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు


వేణుగోపాల్ రావు, ఎండీ సెట్విన్

యాకుత్‌పురా: 2024–25 విద్యా సంవత్సరంలో నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చి 25 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఓ ప్రణాళికతో ముందుకెళ్తున్నామని సెట్విన్ శిక్షణ సంస్థ ఎండీ కే.వేణుగోపాల్‌రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది 14,577 మంది విద్యార్థులకు 45 కోర్సుల్లో శిక్షణ అందిచామన్నారు. డీచ్‌పల్లిలో 100 శాతం, మీరాలట్యాంక్‌లో 84 శాతం, మోతీగల్లీలో 81 శాతం, ఈస్ట్ మారేడుపల్లిలో 90 శాతం, పీర్జాదిగూడలో 93 శాతం మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణతో రూ.2.15 కోట్ల ఆదాయం సంస్థకు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా తెలంగాణ సిక్ సొసైటీ, సెట్విన్ సమన్వయంతో నగరంలోని కిషన్‌బాగ్, హస్మత్ పేట్, వనస్థలిపురం ప్రాంతాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



లంగర్‌హౌస్: శ్రీ రామచంద్రజీ మఠం పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గోల్కొండ ఏసీపీ ఫయాజ్, లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌తో పాటు ఎస్సైలు సంగం ఆలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం

లంగర్‌హౌస్: సుందరాకాండ పారాయణం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సుందరకాండ పారాయణం ఆలపించారు. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో ఉత్తర భారత దేశం నుంచి వచ్చిన భజన కళాకారుల బృందం సుందరకాండ పారాయణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తి గీతాలతో ఆడిపాడుతూ ఆనందంతో మునిగితేలారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం



చాంద్రాయణగుట్ట: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎన్నికలను పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీకి మద్దతుగా హైదరాబాద్ పాతబస్తీ కార్యకర్తలు తరలివెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. పులివెందుల నియోజకవర్గం అభ్యర్థి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తరఫున ప్రచారం నిర్వహిస్తున్న ఆయన సతీమణి వై.ఎస్.భారతితో కలిసి పాతబస్తీకి చెందిన వినయ్ కుర్మ, అజయ్, మహేందర్‌రెడ్డి, భరత్ తదితరులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీదే విజయం


స్వామి సారంగ్ మహరాజ్ మోహిలే ఆశీర్వాదం పొందుతున్న మాధవీలత

చార్మినార్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీదే విజయమని స్వామి సారంగ్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ స్వామి సారంగ్ మహరాజ్ మోహిలే అన్నారని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. సోమవారం తనతో పాటు స్వామిజీ హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతను కలిసి ఆశీర్వదించారు. మాధవీలత ఆయనకు ఫల, పుష్పాలు అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బీజేపీకి విజయావకాశాలు దగ్గరగా ఉన్నాయన్నారు. గెలుపు ఓటములు దైవాధీనం అని..తమ ప్రయత్నాలను చివరి నిమిషం వరకు విరమించుకోవద్దని ఆయన మాధవీలతకు సలహా ఇచ్చినట్లు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

మహిళల కోసమే డయాలసిస్ యూనిట్



గోల్కొండ: కేవలం మహిళల కోసమే డయాలసిస్ యూనిట్ ప్రారంభించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, మజ్లిస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అహ్మద్ పాషాఖాద్రీ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ సాలర్‌జంగ్ కాలనీలో సాఫ్ కిడ్నీ సెంటర్‌లో మహిళల కోసం సిద్ధం చేసిన ఉమెన్స్ ఓన్లీ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే డాక్టర్ అహ్మద్‌ఖాన్ విజయవంతమైన కిడ్నీ డాక్టర్‌గా మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. సాఫ్ కిడ్నీ సెంటర్ వారు నామమాత్రపు ధరలకే డయాలసిస్‌తో పాటు ఇతర కిడ్నీ సంబంధమైన వైద్య సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, అల్లాతమౌలానా సయ్యద్ ఆలే మహ్మద్ ఖాద్రీ అల్‌జిలానీ షబ్బార్ పాషా, సైఫుల్లా, ఎక్బాల్, సాఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

వెయ్యి మందికి స్క్రీనింగ్, వ్యాక్సినేషన్


హజ్ యాత్రికుడిని వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

గోల్కొండ: ఫ్యామిలీ వెల్ఫేర్ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రకు ఎంపికైన వారికి స్క్రీనింగ్ టెస్టులు చేస్తూ వారికి వ్యాక్సిన్‌లు వేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. ఆఖరి విడత బృందంలో హజ్ యాత్రకు వెళ్లే వారికి సోమవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్క్రీనింగ్ చేసి వారికి టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు వెయ్యి మందికి స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ చేశామన్నారు. ఆరుగురు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బందితో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. వక్‌బోర్డు ఈఓ లియాఖత్‌హుస్సేన్ ఈ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ప్రతినిత్యం పరిశీలిస్తూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

గౌలిపురాలో కాంగ్రెస్ ప్రచారం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లో సోమవారం హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌కు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు, సీపీఐ నాయకులు, ఏ–బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి కె.రవి రాజు, సీపీఐ నాయకులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్, టీపీసీసీ కార్యదర్శి కృష్ణ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు రాజుయాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్, డీసీఎం శ్రీనివాస్, శశియాదవ్, కుమార్, చిన్న, అనిల్ పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సీనియర్ సిటిజన్లను మజ్లిస్ పార్టీ ఎప్పుడూ గౌరవిస్తుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన గోల్కొండలో సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ యూనియన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మజ్లిస్ పార్టీ హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి ఓట్లు వేయాలని కోరారు. సీనియర్ సిటిజన్స్‌కు ఒవైసీ ఆసుపత్రి, మజ్లిస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇతర ఆసుపత్రుల్లో ఉచిత చికిత్సలు అందిస్తున్నామన్నారు. పెన్షనర్స్‌కు సంబంధించిన ఎన్నో సమస్యలను తమ పార్టీ పరిష్కరించిందన్నారు. ఈసారి కూడా ఆయనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ సమద్, మజ్లిస్ సీనియర్ నాయకులు వజీఉజ్‌జమా, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లోన్ కట్టాలంటూ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఫోన్

అబిడ్స్: మీ బైక్‌లోన్ కట్టాలని యాక్సిస్ బ్యాంక్ టెలికాలర్ నుంచి ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఫోన్ చేసి కోరారు. ఆయన మీకు ఎవరు ఈ నెంబర్ ఇచ్చారని అడగడంతో పాతబస్తీకి చెందిన ఇర్ఫాన్ ఈ పేరుతో మీ నెంబర్ ఇచ్చారని చెప్పారు. ఎవరు పడితే వారు తన నెంబర్ ఇస్తే ఎలా ఫోన్ చేశారంటూ రాజాసింగ్ కొంత చిరాకుకు గురయ్యారు. నేను ఇర్ఫాన్ కాదని, గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అని ఆయన సమాధానం ఇచ్చుకున్నారు. గూగుల్, యూట్యూబ్, సోషల్ మీడియాలో వీడియోల ద్వారా తాను ఎవరో తెలుసుకోవాలని ఆయన ఆమెకు సూచించారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం


ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకొని విజయ సాధించడం ఖాయమని కార్వాన్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్, కార్వాన్ తదితర డివిజన్లలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటింటికీ తిరిగి కాంగ్రెస్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ క్రమశిక్షణను ఉల్లంఘించదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద, బడుగు వర్గాల ప్రజల ఆరాధ్య నాయకుడన్నారు. ఎం.రఘుపాల్‌రెడ్డి, జి.కిషన్, చంటిబాబు, శశికళ తదితరులున్నారు.

రాష్ట్రంలో బీజేపీ హవా


బీజేపీ సీనియర్ నాయకుడు మనోహర్‌రెడ్డితో దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో రోజురోజుకూ బీజేపీ బలం పుంజుకుంటుందని బీజేపీ సీనియర్ నాయకుడు కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ సోమవారం ఆయనను కలిశారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ..పార్లమెంట్ బరిలో ఉన్న బీజేపీ అగ్రనాయకులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్ రికార్డు మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకొని ప్రధాని మోదీకి బహుమతిగా ఇద్దామని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో వెంకటేష్‌సాగర్ తదితరులు ఉన్నారు.

‘హైదరాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్‌దే’


ప్రచారం చేస్తున్న బహదూర్‌పురా ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్

చార్మినార్: హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకుంటామని బహదూర్‌పురా శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఆరు గ్యారంటీల అమలు కరపత్రాలను ఓటర్లకు అందజేసి కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీలో ఏళ్ల తరబడి అధికారం చెలాయిస్తున్న మజ్లిస్ పార్టీ ఎక్కడ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. అందుకే హైదరాబాద్ ఓటర్లు ఈసారి తమ పార్టీకే ఓటు వేసి తమ ఎంపీ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్‌ను గెలిపించనున్నారన్నారు.

ప్రధాన పార్టీలకు దీటుగా ఎన్నికల ప్రచారం

చార్మినార్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులకు దీటుగా తమ పార్టీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ అధికార ప్రతినిధి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ అన్నారు. సోమవారం పాతబస్తీ మొఘల్‌పురాలోని పార్టీ ప్రధాన కార్యలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గం నుంచి తాను నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో సోమవారం తాను నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి స్థానికుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. సెక్యులర్ పార్టీ అయిన తమ పార్టీ వైపు ఇరువర్గాల ఓటర్లు ఆకర్షితులవుతున్నారన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం


పద్మారావుకు మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

విజయనగర్‌కాలనీ: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ పాదయాత్ర చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఆసిఫ్‌నగర్, శంకర్‌నగర్, దాయిబాగ్, శ్యామ్‌నగర్, దత్తాత్రేయ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఓటర్ల నుంచి స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్.ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి


ఇబ్రహీంబాగ్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

లంగర్‌హౌస్: 13న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ అన్నారు. సోమవారం లంగర్‌హౌస్ ఇబ్రహీంబాగ్, వన్‌మోర్ నగర్, వీకర్ సెక్షన్ బస్తీల్లో పాదయాత్ర చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం రాందేవ్‌గుడలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజ్లిస్‌ను ఆదరించి ప్రజలు తమ ప్రాంతాలను అభివృద్ధి చేయించుకుంటున్నారన్నారు. మరింత అభివృద్ధి కోసం మరోసారి భారీ మెజార్టీతో హైదరాబాద్ స్థానంలో ఎంఐఎంను గెలిపించాలన్నారు. ఈ పాదయాత్రలో కార్పొరేటర్లు అమీరుద్దీన్, నసీరుద్దీన్, నాయకురాలు రేణుక, ఖదీర్ పాల్గొన్నారు.